క్లుప్తంగా

రైతులకు మెరుగైన సేవలు

మామిడికుదురు: వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలందిస్తున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నగరంలో మార్కెట్ కమిటీ పాలక వర్గ సమావేశం సోమవారం చైర్మన్ నక్కా కృష్ణవేణి అధ్యక్షతన జరిగింది. మార్కెట్ కమిటీకి గత నెలలో రూ.12.82 లక్షల ఆదాయం వచ్చిందని కార్యదర్శి జి.ప్రదీప్ తెలిపారు. మార్కెట్ కమిటీ ప్రాంగణంలో వేబ్రిడ్జ్ నిర్మాణానికి, మార్కెట్ కమిటీ చుట్టూ ఉన్న సర్వే చెట్లను తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని, పి.గన్నవరంలో రైతు బజారు ఏర్పాటుకు అంగీకరించాలని కోరుతూ సమావేశంలో తీర్మానాలు చేశారు. రూ.12 లక్షలతో ఆధునీకరించిన మార్కెట్ కమిటీ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కమిటీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యామణి, డైరెక్టర్లు యూవీవీ సత్యనారాయణ, అప్పన అనంతలక్ష్మి, కొప్పిశెట్టి హేమసుందర్, గుత్తుల మధుసూదన రావు, తాటికాయల మధుబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ముల రాము పాల్గొన్నారు.

ప్రవీణ్‌కు అభినందన

సఖినేటిపల్లి: గొంది వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడిగా జైభీమ్ యూత్ అధ్యక్షుడు నల్లి ప్రవీణ్ నియమితులయ్యారు. ఎంపీటీసీ సభ్యుడు కొల్లాబత్తుల నాని ఆధ్వర్యంలో ప్రవీణ్‌కు ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ప్రశంసించారు. సర్పంచ్ దొండపాటి రవికుమార్, మండల యూత్ నాయకుడు నల్లి సుధీర్, జేసీఎస్ ఇన్‌చార్జి నల్లి మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి

మలికిపురం: చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అమలాపురం డీఎస్పీ (దిశ) సుంకర మురళీమోహన్ అన్నారు. సోమవారం మలికిపురం ఏఎఫ్‌డీటీ ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామరాజు అధ్యక్షత జరిగిన సభలో సీఐ ఆర్.గోవిందరాజు, ఎస్సై బి.సంపత్ కుమార్ పాల్గొని దిశ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి ప్రణాళిక సమర్పించండి

కొత్తపేట: 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల వార్షిక అభివృద్ధి ప్రణాళికను త్వరితగతిన సమర్పించాలని జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ (ఏపీఓ) ఎం.భీమారావు సూచించారు. సోమవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన వచ్చే రెండేళ్లకు పాఠశాలల వార్షిక అభివృద్ధి, ఆవాస ప్రాంత ప్రణాళికపై మండలంలో హెచ్‌ఎంలకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. సీఆర్‌ఎంటీ ఎం.నాగరాజు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

మలికిపురం: విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సఖినేటిపల్లిలంక హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయిని, ఏపీ ఎస్జీసీ కోఆర్డినేటర్ గుండేపల్లి ప్రభావతి అన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా సోమవారం మలికిపురంలో ప్రభుత్వ ఎయిడెడ్ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ ముప్పర్తి బాబులు పాల్గొన్నారు.

పీఎంపీలకు శిక్షణ

అయినవిల్లి: మండలంలోని పీఎంపీలకు అమెరికా వైద్యుడు రావి బాల ఆధ్వర్యంలో బృందం అత్యవసర వైద్యంపై సోమవారం శిక్షణ ఇచ్చింది. నేదునూరులో పుట్టి అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్నత వైద్యుడిగా పేరుగాంచిన రావి బాల మాతృ దేశంలో సేవలను తన గ్రామం నేదునూరు నుంచి ప్రారంభించారు. రావి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఫౌండేషన్ వైద్య విభాగం ఇన్‌చార్జి జంగా నాగేశ్వర రావు పర్యవేక్షణలో అమెరికా వైద్యుల బృందం మండలంలోని పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. గుండెనొప్పి, పాము కాటు వంటి వాటికి అత్యవసర సమయంలో ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో వివరించారు. రావి ఫౌండేషన్ చైర్మన్ రావి బాలతో పాటు వైద్యులు హిమ రావి, దిలీప్ రావి, దీప రావి, టెడ్ సాహ, రేను రావి అవగాహన కల్పించారు.

ఆక్వా రైతులకు అవగాహన

సఖినేటిపల్లి: స్థానిక శాంతినగర్ కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం ఆక్వా రైతులకు నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఆక్వా కల్చర్ (ఎన్‌సీఎస్‌ఏ)సంస్థ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ద్వారా వచ్చే ప్రమాదాలపై అవగాహన కల్పించింది. ఎన్‌సీఎస్‌ఏ ప్రాంతీయ సమన్వయకర్త ఎన్‌పీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు ప్రారంభించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎస్.బాలాజీ పాల్గొన్నారు.

కూనవరంలో పొలంబడి

రాజోలు: రైతులు సాగులో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అంశాలపై వ్యవసాయాధికారులు సోమవారం అవగాహన కల్పించారు. కూనవరంలో రైతు భరోసా కేంద్రం ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. డీఆర్‌సీ ఏడీఏ రాజశేఖర్ పలు అంశాలు వివరించారు. రాజోలు ఏఈఏ రామ్మోహన రావు, డీఆర్‌సీ ఏఓ మనోహర్, మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఐరన్ సిరప్

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం ఐరన్ సిరప్ డ్రాప్స్ అందజేశారు. ఎనిమియా ముక్తి భారత్‌లో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది చిన్నారులకు ఈ డ్రాప్స్ వేశారు.

వైఎస్సార్ సీపీతో చరిత్రలో కొత్త శకం

- తిరిగి మళ్లీ జగనే సీఎం కావాలి
- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



కె.జగన్నాథపురంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



ఈదరాడ సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అంజిబాబు



గోపాలపురంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



అంకంపాలెంలో మాట్లాడుతున్న శ్రీధర్

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనతో చరిత్రలో సరికొత్త శకం మొదలైందని, అందుకే మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. సోమవారం కె.జగన్నాథపురం, పోతుకుర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే, పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి రూ.29.89 కోట్లు అందజేశామన్నారు. తొలుత సచివాలయం వద్ద పథకాల లబ్ధిపై డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు జలగం హేమలత తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: సంక్షేమ పథకాలు అమలు చేసే సత్తా కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి అన్నారు. ఈదరాడలో సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్లు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, నేతలు బొలిశెట్టి భగవాన్, యెరుబండి సత్యనారాయణ మూర్తి, సూరిశెట్టి బాబి, చేట్ల సత్యనారాయణ, ఎండీవై షరీఫ్ పాల్గొన్నారు.

అంబాజీపేట: సీఎం జగన్ ప్రభుత్వ పాలనలో పారదర్శకంగా పథకాలు అమలవుతున్నాయని ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రులో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీ సభ్యుడు నెల్లి పండు, పితాని కాశీ, ఊటాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలమూరు: సూర్యారావుపేటలో పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గృహసారథులు గ్రామంలో పర్యటించారు. అనంతరం సచివాలయం వద్ద పల్లె నిద్ర చేశారు. నియోజకవర్గ బూత్ కమిటీల మేనేజర్ నామాల శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ అంబటి ప్రవీణ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కడలి ఉపేంద్ర పాల్గొన్నారు.

ఆత్రేయపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు అన్నారు. అంకంపాలెంలో మాజీ సర్పంచ్ గారపాటి అబ్బులు చౌదరి, గంగారామ్ చౌదరి, శ్రీధర్, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మారిశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యామ్‌సన్ పర్యటించారు. తొలుత సచివాలయం వద్ద సమావేశమయ్యారు. గ్రామంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించారు.

పి.గన్నవరం: ముంగండలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం ఇంత వరకూ రూ.22 కోట్లు వెచ్చించిందని నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని వెంకటేశ్వరరావు ఎగురవేశారు. సర్పంచ్ కుసుమ చంద్రకళ అధ్యక్షతన సమావేశంలో మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, ఎంపీటీసీ ఖండవిల్లి భారతి, నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ...

రావులపాలెం: జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మండల పార్టీ బూత్ కన్వీనర్ కర్రి గోవింద కృష్ణారెడ్డి తెలిపారు. గోపాలపురం సచివాలయం-1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సర్పంచ్ సబ్బితి మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును నాయకులు ఆవిష్కరించారు. పంచాయతీ వద్ద ఏర్పాటైన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, తదితరులు మాట్లాడుతూ అభివృద్ధి కొనసాగాలంటే జగన్ ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి ఉండాలన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని నాయకులు పల్లెనిద్రకు ఉపక్రమించారు. వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, దేవరపల్లి సర్పంచ్ దొమ్మేటి అర్జునరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మైగాపుల గంగాభవాని, పల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి నల్లి మోహన్, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, విజయాలను వివరించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, పార్టీ మండల ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగలక్ష్మి, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రే రాము, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మనదే విజయం



వైఎస్సార్ సీపీలో చేరిన అరుంధతి పేట వాసులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వైఎస్సార్ సీపీలోకి అరుంధతిపేట వాసులు

రావులపాలెం: వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ప్రలోభాలు పెట్టి ఒత్తిడి చేసి టీడీపీలోకి చేర్చుకుంటే, ఒకరోజు తిరగకుండానే మళ్లీ సొంత గూటికి చేరిన ఊబలంక గ్రామానికి చెందిన అరుంధతి పేట వాసులను ఆయన అభినందించారు. అరుంధతిపేటకు చెందిన మెరుగుపువ్వు మధు, యార్లగడ్డ యామినికుమార్, రాచర్ల యేసు, కొమ్మర రాజేష్, కొల్లి అజయ్, యార్లగడ్డ చంటి, ఉండ్రాజవరపు చిన్ని, కొల్లి విజయ్, కొమ్మర బాసు, యార్లగడ్డ సోములు, కండేళ్ల ప్రసాద్ తదితరులు టీడీపీ నాయకుడు బండారు సత్యానందం తదితరుల ఒత్తిడితో ఉదయం టీడీపీలో చేరినప్పటికీ వారి కుట్రలు, కుతంత్రాలు గ్రహించి తిరిగి సొంత గూటికి వచ్చారన్నారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో ఊబలంక గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వారు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ ప్రలోభాలు, ఒత్తిళ్లు, కల్లబొల్లి మాటలకు టీడీపీ పెట్టింది పేరు అని, కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా కొత్తపేట టీడీపీ నాయకులు తయారయ్యారన్నారు. ఇటీవల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సు యాత్రకు వచ్చిన అనూహ్య స్పందన చూసి వారికి మతి భ్రమించిందన్నారు. టీడీపీ హయాంలో ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి, అమలు చెయ్యలేని హామీలు ఇచ్చి మోసం చేశారని, జన్మభూమి కమిటీల పేరుతో దోచుకుతిన్నారని ఆయన అన్నారు. అందుకే గత ఎన్నికల్లో ప్రజలు 23 సీట్లకు పరిమితం చేసి మూలన కూర్చోబెట్టారన్నారు. కానీ తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను, చెప్పని పనులను కూడా చేసి చూపించారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ తిరిగి పచ్చ బ్యాచ్ బూటకపు మాటలతో ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో ప్రజలే నిర్ణయిస్తారని, ఉత్తర ప్రగల్భాలు మానుకోవాలని బండారు సత్యానందరావుకు ఎమ్మెల్యే హితవు పలికారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



బి.దొడ్డవరంలో ఎస్సీ లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలన్నారు. ఆసుపత్రి నుంచి ఏజీ రోడ్డు వరకూ మంజూరైన డ్రైనేజీని త్వరితగతిన నిర్మించాలని ఆయన సూచించారు. ఆసుపత్రిలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ భారతిని ఆదేశించారు. ఇటీవల ప్రారంభించిన ఆసుపత్రి కొత్త భవనంలో ఆరు గదులను పేషెంట్లకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు సమావేశంలో తీర్మానించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, ఎంపీడీఓ భారతి, డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, యూడీసీ పల్లవి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ముంగండ, నాగుల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం నుంచి మంజూరైన వంట పాత్రలను ఆయన అందజేశారు. ముంగండలో ఎంఈఓ కోన హెలీనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. సర్పంచ్‌లు కుసుమ చంద్రకళ, యల్లమెల్లి కృష్ణవేణి, సొసైటీ చైర్మన్ భీమాల సూరిబాబు, నాయకులు కారుపల్లి శ్రీను, మంగం చిట్టిబాబు, బొక్కా ఏడుకొండలు, ఖండవిల్లి కృష్ణప్ప పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బి.దొడ్డవరంలో 27.40 ఎకరాల పెరుగులంకను 84 మంది ఎస్సీ లబ్ధిదారులకు ఐదేళ్ల లీజుకు పట్టాలుగా ఇచ్చారు. గతంలో ఏడాది లీజుకు ఇచ్చే భూములను ఐదేళ్ల కాల పరిమితికి లీజుకు ఇవ్వడం వల్ల లబ్ధిదారులకు మేలు జరుగుతుందని చెప్పారు. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, సర్పంచ్ చెల్లుబోయిన రామ శివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య కుమార్ సత్యామణి పాల్గొన్నారు.

విజయాన్ని ఎవరూ ఆపలేరు

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు



రామరాజులంకలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఉయ్యూరువారి మెరకలో ఉప సర్పంచ్ చెంపాటి రామకృష్ణంరాజు ఇంటి వద్ద జరిగిన పార్టీ సమావేశంలో మోరి, ఉయ్యూరువారి మెరక గ్రామాలకు చెందిన టీడీపీ సానుభూతి పరులు, ఇతరులు కలిపి 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అధ్యక్షతన సమావేశం జరిగింది. సీఎం జగన్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు మెచ్చి పార్టీలోకి చేరినట్టు కడలి మంగాదేవి, కండెల నాగమణి, కడలి నాగవేణి తదితరులు అన్నారు. రిటైర్డ్ టీచర్ గెద్దాడ త్రిమూర్తులు, ఎంపీపీ వీరా మల్లిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: లంక భూములు సాగు చేసుకుంటున్న పలువురు రైతులకు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు లీజు పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శివకోటి లంక భూముల్లో సాగు చేస్తున్న రైతులకు ఈ పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, సర్పంచ్‌లు రేవు జ్యోతి, నక్కా రామారావు పాల్గొన్నారు.

మలికిపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. రామరాజులంక భూములకు సీ క్లాస్ లీజు పట్టాల పంపిణీ కార్యక్రమం రామరాజులంక సీసీఎఫ్ సొసైటీ వద్ద జరిగింది. గ్రామానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఈ పట్టాలు అందజేశారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, ఎంపీటీసీ మేడిచర్ల వెంకట రాజు, నాయకులు చింత రాజబాబు, నల్లి శివకుమార్, చొప్పల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో ప్రజాహిత పాలన



గొందిలో మహిళకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజాహిత పాలన సాగుతుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం గొందిలో ఎమ్మెల్యే రాపాక, ఆయన తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలసి అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిపై బ్రోచర్లు అందజేశారు. సాంకేతిక కారణాలతో అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ సీఎం జగన్ తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలతో పేదల ముంగిట్లోకే పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు. సర్పంచులు దొండపాటి రవికుమార్, కొండా జాన్‌బాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కొల్లాబత్తుల శుభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, నాయకులు ఒడుగు వెంకట్, కుసుమ చింటూ, గెద్దం అమ్ములు, నల్లి ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి.. ప్రణమిల్లె జగతి



అయినవిల్లిలో జ్యోతిర్లింగార్చన చేస్తున్న భక్తులు

కొత్తపేట: కార్తిక మాసం తొలి సోమవారాన్ని సందర్భంగా పలివెలలో ఉమా కొప్పేశ్వరస్వామివారి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. మందపల్లి ఉమామందేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు.

మామిడికుదురు: పెదపట్నంలంకలోని ఉమా సత్య లింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన ఘనంగా జరిగింది. 125 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు.

అంబాజీపేట: మాచవరంలో పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి ఆలయాలు, పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంతో పాటు గ్రామాల్లోని శివాలయాల్లో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు.

పి.గన్నవరం: పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో మహిళలు దీపారాధన చేశారు. అంతర్వేది నీలకంఠేశ్వరస్వామివారి, మోరి సీతారామలింగేశ్వర స్వామి, గుడిమూల రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో రద్దీ నెలకొంది.

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి శ్రీసిద్ధివినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన, జ్యోతిర్లింగార్చన పూజలు చేశారు.

రాజోలు: శివకోటి ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కడలిలో కపోతేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఆత్రేయపురం: ర్యాలి ఉమాకండలేశ్వర స్వామి, జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురంలో బాలాత్రిపుర సుందరీ రాజరాజేశ్వరీ స్వామి, వాడపల్లిలో విశ్వేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అన్నదానానికి సత్తి సూర్యభాస్కరరెడ్డి లక్ష్మి దంపతులు రూ.10 వేల విరాళం సమర్పించారు.

ఆలమూరు: పెనికేరులోని యిష్టకామేశ్వరస్వామి, ఆలమూరులో విక్రమ భట్టేశ్వరస్వామి ఆలయాలతో పాటు వివిధ శివాలయాల్లో భక్తులు కార్తిక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మామిడికుదురు/ అంబాజీపేట/ మలికిపురం/ పి.గన్నవరం/ కొత్తపేట/ సఖినేటిపల్లి/ రాజోలు/ రావులపాలెం: మామిడికుదురు గ్రంథాలయంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ జరిగింది. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సభకు హెచ్‌ఎం కడలి సాయిరామ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. మలికిపురం గ్రంథాలయంలో వివిధ పోటీల్లో విజేతలకు సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పిశెట్టి సీతామహాలక్ష్మి, జక్కంపూడి శ్రీదేవి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. పి.గన్నవరం గ్రంథాలయంలో లైబ్రేరియన్ జి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభకు ఎంపీడీఓ ఎం.భారతి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. సర్పంచ్ బొండాడ నాగమణి పాల్గొన్నారు. కొత్తపేట ఉప గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కుంచే సునీత అధ్యక్షతన జరిగిన సభలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు, సబ్ జైల్ సూపరింటెండెంట్ జీవనాథన్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పెద్దిరాజు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. అంతర్వేదిపాలెం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.వెంకటలక్ష్మి ఆధ్వర్యాన విజేతలకు మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర బహుమతులను అందజేశారు. రాజోలు శాఖా గ్రంథాలయం వద్ద ముగింపు సభకు సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు హాజరయ్యారు. సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రావులపాలెం డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ అధికారి ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలకు ఎంఈఓ ఏవీఎస్ రాజు హాజరై మాట్లాడారు.



బహుమతులు అందిస్తున్న న్యాయవాది పాపయ్యపంతులు

చిన్నారుల్లో స్ఫూర్తి నింపేలా రచనలు



కొత్తపేటలో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు హరిప్రసాద్, లీలావతి, హెచ్‌ఎంలు

కొత్తపేట: ప్రముఖ కవి, రచయిత అద్దంకి కేశవరావు రచించిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తలు, ప్రముఖుల చరిత్రలు, వివిధ కథలు చిన్నారుల్లో స్ఫూర్తి నింపుతాయని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అన్నారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల సమావేశం జరిగింది. తొలుత స్థానిక ప్రియదర్శినీ బాలవిహార్ వ్యవస్థాపకుడు, ప్రముఖ కవి దివంగత అద్దంకి కేశవరావు సుమారు 60 ఏళ్ల నాడు రచించిన బాలల పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కవి కేశవరావు రచించిన అకేరా కమ్మని కథలు, పడవ గది తెచ్చిన పరివర్తన, అశోకుడు, గౌతమ కల్యాణం రచనలను ఆయన తనయుడు, ప్రియదర్శినీ బాలవిహార్ కరస్పాండెంట్ బుద్ధచంద్రదేవ్ పుస్తక రూపంలోకి తీసుకువచ్చారు. వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో బాలలచే చదివించాలనే ఉద్దేశంతో అవసరమైన ప్రతులను సమకూర్చారు. వాటిని ఎంఈఓలు హరిప్రసాద్, లీలావతి ఆవిష్కరించి మండలంలో 82 ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాలకు ఉచితంగా అందజేశారు. ఎంఈఓ హరిప్రసాద్ మాట్లాడుతూ బుద్ధచంద్రదేవ్ తన తండ్రి కేశవరావు రచనలను ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పుస్తకాల రూపంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.

కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

రావులపాలెం: రావులపాడు కాలవంతన గుడారాలలో ఉన్న వలస కూలీల చిన్నారులకు ర్యాలికి చెందిన అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంచార ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను విశాఖపట్నానికి చెందిన రిటైర్డ్ ఇంజినీర్ మచ్చ నిరంజన్ కుమార్ సోమవారం ప్రారంభించారు. చిన్నారులకు ప్యాడ్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశామని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మోహిత్ తెలిపారు.

మహిళలకు శిక్షణ పూర్తి

మామిడికుదురు: పాశర్లపూడిలో నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సోమవారం ఏజీఎం సర్టిఫికెట్లను నాబార్డు ఏడీజెం వై.సోమునాయుడు అందించారు. కోనసీమ క్వాయర్ కోకోనట్ వాల్యూ యాడెడ్ ఉత్పత్తులపై మహిళలకు 15 రోజులు శిక్షణ ఇచ్చామని అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: పంచారామాలకు రావులపాలెం ఆర్టీసీ డిపో నుంచి ఏడు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కుమార్ సోమవారం తెలిపారు. కార్తిక మాసంలో అన్ని ఆదివారాలు పంచారామ బస్సులతో పాటు ఏకాదశ రుద్రులు మన్యసీమ దర్శనం, కోనసీమ క్షేత్ర దర్శనం సప్త శ్రీనివాసులు, నవ జనార్దన స్వాముల దర్శనం, ఉత్తరాంధ్ర క్షేత్ర దర్శనం, కృష్ణ తీర దర్శనం, భద్రాచల- పర్ణశాల క్షేత్ర దర్శనానికి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 73829 11871 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

రావులపాలెం: స్థానిక సిద్ధార్థ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటారని డైరెక్టర్ కె.ముల్లారావు సోమవారం తెలిపారు. రామచంద్రపురం ఆర్‌సీఎం చర్చ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీల్లో స్పారింగ్ విభాగంలో అభిరామ్ గోల్డ్ మెడల్, చైతన్య సిల్వర్, ఎం.భరత్ రెడ్డి బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు.

13 మందికి కంటి శస్త్రచికిత్సలు

ఆలమూరు: మండలంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో కంటి లోపాలను గుర్తించిన 13 మందికి శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి తెలిపారు. ఈ మేరకు వారిని సోమవారం ప్రత్యేక వాహనంలో రాజమహేంద్రవరంలోని సిద్ధార్థ పాలీ క్లినిక్‌కు తరలించామన్నారు.

కోర్కెలు నెరవేర్చాలని వినతి

కొత్తపేట: తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని అంగన్‌వాడీ సిబ్బంది కోరారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) పిలుపు మేరకు అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ, పెన్షన్ అమలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.